


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

### అధ్యాయం – 2

**వర్షాకాలం** అవటంవల్ల సూర్యుడు ఇంకా పూర్తిగా రాలేదు(correct?). నల్లటి మేఘాల్ని మేలి ముసుగుగా కప్పుకుని, విష్ణువుతో సంగమం కోసం మసక చీకట్లో భూదేవి వెళుతోంటే అల్లరి మన్మథుడు సూర్యుడిని చేబదులు అడిగి కిరణాలు బాణాలుగా వేస్తున్నాడు. మన్మథ బాణపు జలదరింపులకు ఎద సన్నగా వణికితే, జారిన పయ్యెద ఊపుకి పిల్ల మేఘం కరిగి ఆ వర్షపు చినుకుల శబ్దం, ఎంత నిశ్శబ్దంగా నెమ్మదిగా నడిచినా కదలాడే ప్రియురాలి కాలి మువ్వల సవ్వడిలా ఉంది. మేఘపు సందుల గుండా ఒక కిరణం జారి ఆమె కాలి మట్టె మీద, మరో బాణం కొప్పు కనకాంబరాల మీద పడి పరావర్తనమై ఇంద్రధనస్సు అయింది.

అప్పుడే మెలకువ వచ్చింది శ్రీకళ్యాణికి. ఎయిర్ కండిషనర్ ఆపుచేసి బయట బాల్కనీలోకి వచ్చింది. ప్రభాత గాలి స్వచ్ఛతకి చాలా ఫ్రెష్‌గా ఫీలయింది. ఆ గాలిలోంచి ఒక పాట ఆమె చెవులకి సోకింది.

**నువ్వు వస్తావనీ – నిన్ను చూడాలనీ – పచ్చచీరె కట్టిందీ – ప్రకృతమ్మ**

**నువ్వు చూస్తావనీ – జడను చేరాలనీ – తెల్లరైక తొడిగింది – మల్లెరెమ్మ.**

ఆ కంఠంలో గొప్ప 'కళ' లేదు. అనుభవజ్ఞుడయిన పాటగాడి స్వరపు మధురిమ కూడా లేదు. అపస్వరాలు కూడా ఉన్నాయి. అయినా ఆ పాటలో ఉన్న అర్థం గమ్మత్తుగా ఉంది.

ఆమె క్రిందికి దిగింది. కూనిరాగాలు తీస్తూ పెయింటింగ్ వేసుకుంటున్నాడు కార్తికేయ. గాయకుడు కాదు గానీ అతడు నిశ్చయంగా గొప్ప పెయింటరు. ఆ విషయం అతడు వేస్తున్న బొమ్మని చూస్తుంటేనే తెలుస్తోంది. హేమంతాన్నీ, వసంతాన్నీ కలిపి అంటు గడితే పుట్టిన అపురూపమైన మొక్కలా ఉన్నదా పెయింటింగ్.

''మీకు ఇందులో కూడా ప్రవేశం ఉన్నదా?'' అని అడిగింది. హఠాత్తుగా వెనుక నుంచి వినబడిన ఆ ప్రశ్నకు అతడు ఉలిక్కిపడి వెనుతిరిగి ఆమెను చూసి కంగారుపడ్డాడు. ''...క్షమించండి మేడం, మీరు లేచారనుకోలేదు. కాఫీ తీసుకు వస్తాను'' అంటూ హడావుడిగా బ్రెష్ అక్కడే వదిలేసి వంటింట్లోకి పరుగెత్తాడు. ఆమె వద్దనలేదు.

అతడు కాఫీ కప్పుతో ప్రవేశిస్తూ ''ప్రొద్దున్నే మీరు తొందరగా లేవరని నేను కాఫీ కలపను'' అన్నాడు.

''ఇట్సాల్‌రైట్'' అన్నదామె కప్పు అందుకుంటూ.అతడింకా గిల్టీగానే నిల్చుని ఉన్నాడు.

ఆమె అంది. ''నేను రాత్రి ఆలోచించాను. మిమ్మల్ని వంటవాడిగా ఉంచుకోవటం నాకు బాధగా ఉంది.''

అతని మొహం వాడిపోయింది. ''తీసేస్తారా మేడమ్?'' అన్నాడు.

''లేదు. మీరు మెడిసిన్ పూర్తిచేయండి. మీ ఖర్చులన్నీ నేను భరిస్తాను.''

''వద్దొద్దు'' అన్నాడు అతను కంగారుగా.

''ఊరికే వద్దులెండి. మీరు నా ప్రాణాలు రక్షించినందుకు కృతజ్ఞతగా అనుకోండి లేదా స్నేహ పురస్కారంగా అనుకోండి. ఏమైనా మీ ఇష్టం.''

అతడు సమాధానం చెప్పలేదు. ఆమె అంది. ''ఇంత మెటీరియలిస్టు, ప్రతి పైసాకి లెక్క చూసుకునే వ్యాపారి ఇలా మాట్లాడుతోందేమిటి అనుకుంటున్నారా? పోనీ అప్పుగా తీసుకోండి. తరువాత తీర్చేద్దురుగానీ.''

''లేదు. నాకు చదవాలని లేదు. వీలయితే కొంత డబ్బు సంపాదించి కలకత్తా వెళ్ళి శాంతినికేతన్‌లో చేరాలని ఉంది.''

ఆమె ఆశ్చర్యంగా ''శాంతినికేతన్‌లోనా?... ఎందుకు?'' అని అడిగింది.

''పెయింటింగ్ నా అభిరుచి. దాన్ని పెంపొందించుకోవటం కోసం.''

''పెంపొందించుకుని?'' ఆమె అర్థంకానట్లు చూసింది.

''ఇంకేమీ లేదు. పెంపొందించుకోవటం కోసం. అంతే'' చెపుతూంటేనే అతడు తన కలల ప్రపంచంలోకి వెళ్ళిపోయాడు.

''పెయింటింగ్‌ని కూడా ప్రొఫెషనలైజ్ చేస్తారన్నమాట. అమ్ముతారా?''

''లేదండీ. నా తృప్తి కోసం వేసుకుంటాను. ఇంకెందులోనూ నాకు తృప్తి రాదు. ఒక కాన్వాసూ, ఒక కుంచె ఇస్తే చాలు. తిండి, గాలి కూడా అవసరం లేదు. ఇదిగో ఈ బొమ్మలో నేను ప్రేయసి, ప్రియుల కలయిక వేశాను. 'విశ్వమంతచోటు నాకేల? నీ పక్క ఇరుకు స్థలముండగా' అన్నట్లు ఆమె ఎలా ఒదిగిపోయిందో చూడండి. ఇది తొలి ముద్దు... ముద్దంటే మోడ్పులైన కన్నులని అరమోడ్పులు చేయటమట. ప్రేమగీతానికి ముద్దు కన్నా గొప్ప ఆర్కెస్ట్రైజేషన్ లేదు కదండీ... ఏవండీ? ఆమె కళ్ళలో ఆ తొలిముద్దు భావం కనిపింపచేయటంలో నేను సక్సెస్ అయ్యానా?''

అతడి బలహీనత ఆమెకి దొరికిపోయింది. ఎప్పుడూ తన ఆలోచనల్లో తానుండి, గాంభీర్యం ముసుగులో గాంధేయవాదిలా ఉండే కార్తికేయ కాదు ఇతడు. గాలిపటం ఎగరేసే చిన్న కుర్రాడిలా కొత్తగా ఉన్నాడు. శ్రీకళ్యాణికి ఉత్సాహంగా అనిపించింది. మిషన్‌గన్ పట్టుకుని వస్తున్న టెర్రరిస్టు, పిల్లి అంటే భయపడతాడని తెలిసిన తరువాత కలిగే

రిలాక్సేషన్ లాటిది. లక్షలతో బిజినెస్ డీల్ చేస్తున్నప్పుడు అవతలి మనిషి వీక్‌పాయింట్ దొరికితే కలిగే ఉత్సాహం లాంటిది కలిగింది.

''ఎంతకాలం నుంచి వేస్తున్నారీ బొమ్మ?'' అని అడిగింది.

''నెల రోజుల్నుంచి వేస్తున్నాను. ప్రతిరోజూ తెల్లవారుజామునే లేచి రెండు మూడు గంటలు వేస్తున్నా ఇంకా పూర్తి కాలేదు.''

''మైగాడ్. ఇంత శ్రమ, ఏకాగ్రత వ్యాపారంలో పెడితే ఈపాటికి లక్షాధికారి అయి ఉండేవారు.''

దక్షిణపు మేఘాలమీద నుంచి వచ్చే చల్లటిగాలి చాలా ఉల్లాసంగా ఉంది. అతడు నవ్వాడు. చిన్న పాపలాటి నవ్వు. నిజమైన కళాకారుడికి మాత్రమే వచ్చే స్వచ్ఛమైన నవ్వుతో అతనన్నాడు ''ఈనాటి సమస్యల్ని రేపెలా ఎదుర్కోవాలా అన్న టెన్షన్‌తో వ్యాపారి నిద్రపోతాడు. ఈ రోజు వచ్చిన ఆలోచనకి రేపెలా ఆకృతి ఇవ్వాలా అన్న సంతృప్తితో ఆర్టిస్టు నిద్రపోతాడు. అదీ తేడా.''

ఆమె ఆశ్చర్యపోయింది. రెండు చిన్న వాక్యాల్లో అతడెంత గొప్ప సూత్రం చెప్పాడా అనుకుంది. నిజమే కదా. ప్రతి రాత్రీ ఉదయం కోసం ఒక సమస్య! ''... కానీ ఇంతమందిని పోషిస్తున్నాం. ఇంత వ్యవహారం నడుపుతున్నాం అన్న అహం సంతృప్తి ఉన్నది కదండీ'' అంది. అతడు తలూపాడు.

''నేను ఊరికే చెప్పానండీ. ఎవరి ఆనందం వాళ్ళది. వ్యాపారంలో గొడవలే లేకపోతే మీకు నిద్రే పట్టకపోవచ్చు.''

''నిజంగా ఆ పాట బావుందండీ. ఏదయినా సినిమాలోదా?''

''కాదండీ నేనే ఊహించుకున్నాను. కొన్ని పదాల పేర్లు గమ్మత్తుగా ఉంటాయి కదండీ. 'తెల్లరైక తొడిగింది మల్లెరెమ్మ' మంచి ప్రయోగం కదూ.''

ఆమెకు తెరలు తెరలుగా నవ్వొస్తోంది. కార్తికేయకి అదేం పట్టలేదు. ఏ కళాకారుడయినా అంతే. తన రంగంలోని టాపిక్ చర్చకి వస్తే మైమరచి పోతాడు. వాదిస్తాడు, వింటాడు, కేరింతలు కొడతాడు. శ్రీకళ్యాణి నవ్వుని పెదవి క్రిందా, పెదవిని పంటి కిందా నొక్కిపట్టి "ఏమో నేనంత ఆనందం ఎప్పుడూ అనుభవించలేదేమో'' అంది.

''అయ్యో. నా ఉద్దేశ్యం అదికాదండీ. మనసంతా ఆనందం నిండినప్పుడు నిజంగా కన్నీళ్ళు వస్తాయి. ఒక్కసారయితే బొమ్మ వేయటం పూర్తికాగానే నేను ఏడ్చేశా తెలుసా?''

''ఎందుకండీ? బాగా రాలేదా?'' నవ్వు నొక్కి పెట్టి అడిగింది.

''చాలా బాగా వచ్చిందండీ అందుకే ఏడుపొచ్చింది.''

''మీరేసిన మిగతా బొమ్మలు చూపిస్తారా?''

''దానికేం భాగ్యమండీ'' అంటూ అతను పదేళ్ళ కుర్రాడిలా లోపలికి పరిగెత్తుకు వెళ్ళి ఏకంగా ఒక ట్రంకుపెట్టె తీసుకొచ్చాడు. శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి శిథిలంలా ఉంది. అందులోంచి ఒక కేలండర్ల కట్టలాటిది తీశాడు.

''అమ్మో ఇవన్నీ మీరేసిన బొమ్మలేనాండీ?'' ఆశ్చర్యంగా అడిగింది.

''అవును. పదహారో సంవత్సరం నుంచి వేస్తున్నాను''

ఆమె వాచీ చూసుకుంది. ఏడు కాలేదు. ఆఫీసు కెళ్ళడానికి ఇంకా టైముంది. ఇంకొంచెం సేపు ఆట పట్టించవచ్చు. ''ఒక బొమ్మ వేశాక మీరు ఏడ్చాను' అన్నారే అదేదీ?'' అని అడిగింది. అతడు దాన్ని బయటకి తీశాడు. అదొక అద్భుతమైన బొమ్మ అని చూస్తూంటేనే తెలుస్తోంది. సముద్రపు ఒడ్డున చెట్టు క్రింద నిలబడి ఒక స్త్రీ దూరంగా వస్తున్న పడవకేసి చూస్తోంది. క్రింద 'విషాదం' అని వ్రాసి ఉంది.

ఆకాశం కాన్వాస్‌మీద సూర్యుడినీ, చంద్రుడినీ, చుక్కల్నీ అద్దటానికి విశ్వప్రకృతికి ఎన్నివేల యుగాలు పట్టిందో తెలీదుగానీ ఆ బొమ్మ వేయటానికి చిత్రకారుడికి సంతృప్తా సంతృప్తాల ఉచ్ఛ్వాస నిశ్వాసాలు లక్షలు వేలు పట్టి ఉంటాయి. ఆకుపచ్చ పచ్చిక బయళ్ళ దుప్పటి క్రింద నుంచి అప్పుడే నిద్ర లేచిన చలి, బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ, విచ్చుకుంటున్న గులాబీ మొగ్గలకి సుప్రభాతం చెప్పి, తాను సృష్టించిన మంచు బిందువులకి 'మళ్ళీ రాత్రికి తిరిగొస్తాన'ని వీడ్కోలు చెప్పి, సూర్యుడికి అందకుండా పశ్చిమానికి పరుగెత్తుతున్న వేళ... సముద్రపు అలల కాన్వాసు మీద ప్రత్యూషపు పెయింట్‌లో పొగమంచును మిళితం చేసి వేసిన బొమ్మ అది.

''ఏవండీ మీరు నా అజ్ఞానాన్ని క్షమిస్తే, ఈ బొమ్మ నాకేమీ అర్థంవటం లేదు. కింద 'విషాదం' అని వ్రాసి ఉందేమిటి?'' అంది ఆమె.

''వియోగం కన్నా గొప్ప విషాదం ఏముంటుంది?''

''వియోగమా? కొంపతీసి మీరెప్పుడయినా ప్రేమలో పడ్డారా?''

''లేదు''.

''మీ ప్రియురాలేమో అనుకున్నాను. అనుభవం లేకుండా కూడా విషయం చెప్పొచ్చునన్నమాట. అంతేలెండి. కొత్త వ్యాపారంలో ప్రవేశించేటప్పుడు కూడా మేమిలాగే సర్వం తెలిసినట్టు నటిస్తాం'' అంది. అందులో వెటకారం లేదుగానీ, కళని వ్యాపారంతో పోల్చటం అతడికి కాస్త బాధనిపించింది. తొమ్మిది నెలల సజీవాకృతిని ఆప్యాయంగా తడివి చూసుకునే తల్లిలా అతడు ఆ బొమ్మని ప్రేమమయ దృక్కులతో స్పృశించాడు.

**'అనుభవం లేకుండా కళాకారుడు విషయం చెప్పలేడా?'** అనుకున్నాడు అతడు. కళాకారుడంటే విషాదానందాల చెలియకట్ట ఒడ్డున నిలబడ్డ ఏకాంత వృక్షం. ప్రశ్నల ఆకుల్నీ, జవాబులు పుష్పాల్నీ తనే పూస్తూంటాడు. మనసు కార్చే కన్నీటి

జడుల్లో రెక్కలల్లార్చుకుంటున్న పావురాళ్ళ మాదిరిగా అతని ఆలోచనలు కదుల్తుంటాయి. అతని మనసు చుట్టూ ఎప్పుడూ ఒక మయా మహార్ణవం లాంటి శూన్యం ఆవరించుకుని ఉంటుంది. కవి ఊహకి హద్దులెక్కడ ?

***'ప్రేమంటే నాకు తెలీదా?'*** గోడమీద రాలిపోతున్న కాలానికి రెప్పపాటులో రెండో అడుగు వెతుక్కునే గడియారానికి ఏం తెలుసు ప్రేమంటే?

***'విరహమంటే నాకు తెలీదా?'*** రాత్రంతా నిద్ర లేకుండా ఆలోచించి, ఆ విషయం మర్చిపోవాలని ఓ నిర్ణయానికి వచ్చి– మళ్ళీ తెల్లవారగానే ఏం మర్చిపోవాలో జ్ఞాపకం వచ్చి... ఇదేగా విరహమంటే. ఆ విరహాన్ని ఆ బొమ్మ కళ్ళల్లో చిత్రీకరించటానికి నా వేళ్ళకుంచెలు ఎన్ని నెమలి పింఛాల్ని అరువు అడిగాయి?

***'విషాదమంటే నాకు తెలీదా?'*** వసంతాలు రాకుండానే ఎన్ని వర్షాలు గడిచిపోయాయి? కొత్త చిగుళ్ళకి కాలమింకా రాలేదనుకుంటూ ఎన్ని కోకిలలు వెనుదిరిగాయి?

***'వియోగమంటే నాకు తెలీదా?'*** ఆ వియోగాన్ని ఆమె మొహంలో చిత్రీకరించటానికి నా కళ్ళ సెర్చిలైట్లు ఎన్నివేల కోణాల్ని ఫోకస్ చేసి ఉంటాయి?

***'విషాదాన్ని చిత్రీకరించడం నాకు రాదా?'*** నిన్నటి అనుభవపు జ్ఞాపకం ఉడుత పిల్లలా ఎగురుకుంటూ వచ్చి ఈ రోజు 'ఆలోచన' అనే మామిడి కొమ్మమీద వాలినట్టు... వియోగాన్ని విషాదం కప్పేస్తోంది. విషాదం అంటే దుఃఖం కాదు. దుఃఖం రాకపోవడం. యూకలిప్టస్ అడవుల మధ్య పేరుకున్న నిశ్శబ్దంలోంచి నూర్జహాన్ పాట వినడం విషాదం. రెప్పల నిద్దర అద్దకుండా వెళ్ళిపోయే రాత్రిని చూస్తే విషాదం. ఆ విషాదాన్ని నా కాన్వాస్ మీద చిత్రీకరించటం కోసం ఎన్ని సముద్రాల మీద పేరుకున్న స్తబ్ధతనీ... ఎన్ని సాగర గర్భాల్లో నిశ్శబ్దాన్ని పరామర్శించాను?

''ఏమిటీ మీలో మీరే ఆలోచనల్లో పడిపోయారు?'' అన్న ఆమె మాటలకి అతడు చప్పున తేరుకుని 'ఏమీలేదు' అన్నాడు.

''మిమ్మల్ని నేనేమయినా హర్ట్ చేశానా?''

''లేదే''

''ఇన్ని మంచి బొమ్మల్ని ఫ్రేమ్ కూడా కట్టించకుండా ఇలా పాత ట్రంకుపెట్టెలో పెట్టుకున్నారేం?''

''రోజుకో ఇల్లు మారేవాడిని. ఫ్రేమ్‌లు కట్టించుకుని ఎక్కడ తగిలించుకోను మాడమ్? తగిలించాలంటే రాజభవనం కావాలి.''

''ఎవరయినా రాజకుమారి ప్రేమిస్తుందేమో చూడండి'' నవ్వుతూ అంది. అతడు సమాధానం చెప్పలేదు. ఆమె తిరిగి ''నన్నెవరు ప్రేమిస్తారు అనుకుంటున్నారా? మన దేశంలో ఏమీ లేకపోయినా కళాభిమానులకేం తక్కువ?'' అంది.

ఆ వాక్యం మామూలుగా కనపడినా, ఆమె మనసుకు అద్దం పట్టే వాక్యం అది! ఆమె ఉద్దేశ్యంలో మనుష్యులు రెండు రకాలు, కష్టపడి పని చేసేవాళ్ళు. ఏ పనీ లేకుండా రోజంతా టేప్ రికార్డర్‌లో గజల్స్ వింటూ, స్నేహితులకు ఎందుకూ పనికిరాని ఉత్తరాలు రాసుకుంటూ, 24 గంటలూ భావనా లోకాల్లో విహరించేవాళ్ళు. శ్రీకళ్యాణి భావాల్లో మెటీరియలిజం, మనసులో ప్రొడక్టివిటీ పట్ల ఇష్టం అలా చిన్నతనం నుంచి అలా పెరుగుతూ వచ్చాయంటే దానిక్కారణం ఆమె జీవన విధానం. ఒకే మనిషిలో ప్రొడక్టివిటీ, కళ, రెండూ కూడా ఉండొచ్చునేది ఆమెకి ఊహకందని విషయం. ఒక చిన్న పెయింటింగ్ వేయటానికి కార్తికేయ వంద సుదీర్ఘమైన ఉదయాలు గడిపాడంటే ఆమెకు అది ఎనిమిదో వింతలా కనిపించింది.

ఆమె ఆ పెయింటింగ్ చేత్తో పట్టుకుని గాలిలో ఊపుతూ ''ఆర్ట్‌కన్నా డబ్బు అవసరం ఎక్కువని ఈ బొమ్మే చెపుతోంది చూడండి. కాగితానికి కనీసం ఫ్రేమ్ కట్టించాలన్నా డబ్బు కావాలి. లేకపోతే చిన్న గాలికి కూడా ఇలా'' అంటూ ఊపింది. ఆ ఒత్తిడికి, అసలే శిథిలపత్రంలా ఉన్న ఆ బొమ్మ మధ్యకి సర్రున చిరిగింది.

వెన్నెల సముద్రం మీద గాజు కెరటం పగిలిన ధ్వని. గుండె నెరదల్లో గునపం గుచ్చిన బాధ. అందమైన ప్రత్యూషానికి చితి పేర్చిన గ్రీష్మపు మంటల్లో భగభగమండే నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో పేలిన శతఘ్నికి, ఇహపరాల తరతరాల చరాచరాల దుఃఖం… ఒక్కడ్నే ఆక్రమించి, ఒక్కడ్నే ఆశ్రయించి– మనసు స్తబ్ధమై, ఆశ దగ్ధమై, ధాత్రి నిశ్శబ్ధమైంది.

నిజాయితీగా, మనస్ఫూర్తిగా, బాధగా ఆమె 'ఐయామ్‌సారీ' అంది. అతడు మాట్లాడలేదు. మౌనంగా ఆమె చేతుల మధ్యనుండి ఆ బొమ్మను తీసుకున్నాడు. అతడి వేళ్ళు కంపించటం ఆమె చూసింది. కంటి నీటిపొర స్పష్టాస్పష్టంగా గోచరించింది.

''క్షమించండి. నేనిలా అవుతుందనుకోలేదు.''

అతడు కాగితాన్ని తిరిగి ట్రంకుపెట్టెలో పెట్టుకుంటూ, జవాబు చెప్పలేదు.

''దాని ఖర్చు నేనిస్తాను'' అన్నదామె సంజాయిషీగా.

''దీని ఖర్చు ఏముంది? కాగితమూ రంగులేగా. పోనివ్వండి'' అతడి కంఠం, ఆవేదనా ఉద్వేగాల్ని అణచుకుని మామూలుగా కనబడే యత్నంలో ఓడిపోయి రుద్ధమైంది.

''మీరు బాధపడటం నాకు ఇష్టం లేదు. నా వల్ల పొరపాటు జరిగింది. దాన్ని సరిదిద్దుకోనివ్వండి.''

''నాకు బాధగా లేదని ఆత్మవంచన చేసుకోలేను. కానీ ఎవరు మాత్రం ఏం చేస్తారు?''

''నేను చేస్తాను. ఈ బొమ్మ వేయటానికి రెండు మూడు నెలలు పట్టిందంటున్నారు. ఆ జీతం ఊరికే తీసుకోండి. మిగతా అన్ని ఏర్పాట్లూ నేను చేస్తాను. ఇంకా మంచి కాగితం… మంచి రంగులూ…''

అతడు నవ్వాడు. ''ఎకనమిక్స్ మీ రక్తంలో బాగా జీర్ణించుకుపోయినట్టుంది. కాగితం, రంగులు 'లాండ్'. నా జీతం 'లేబర్'. మీ పెట్టుబడి 'కాపిటల్'. బావుంది. కానీ నిర్ఝరినీ... పచ్చికనీ... విచ్చిన స్వప్నాన్నీ ఏ ఫ్యాక్టరీ సృష్టించలేదు. ఒక బొమ్మ పోతే మరో బొమ్మ చిత్రించటానికి మనసేమీ రూపాయల్ని ముద్రించే యంత్రం కాదు.''

''పోన్లెండి ఇంకొక్క బొమ్మని చిత్రించవద్దు! పోయిన బొమ్మకి ఖరీదు చెప్పండి. లేకపోతే నాకు మనశ్శాంతి ఉండదు.''

అతడు నవ్వే ప్రయత్నం చేస్తూ ''నేను దీన్ని మీకు బహుమతిగా ఇచ్చాననుకోండి. సరేనా'' అన్నాడు వాతావరణాన్ని తేలిక చేయటానికి ప్రయత్నిస్తూ.

ఆమె అహం దెబ్బ తిన్నది. కటువుగా ''నేనెవరినుంచి ఆయాచితంగా బహుమతులు స్వీకరించను'' అంది.

''నేను కూడా నా బొమ్మలకు విలువ కట్టను''. అతనూ అంత ఖచ్చితంగా చెప్పాడు.

ఆమెకు మరింత కోపం హెచ్చింది. ''ఇప్పుడు నేను చింపకపోయినా మరో ఏడాదికైనా ఆ బొమ్మలు శిథిలమవక తప్పదు. ఒక్క బొమ్మ నాకు అమ్మటం వల్ల మీరు మిగతా వాటిని రక్షించుకుంటున్నారు. ఈ మాత్రం లాజిక్ ఆలోచించరేం?''

''అన్ని ఫీలింగ్స్‌కి లాజిక్ లుండవు''.

''పదివేలిస్తాను. మీరా బొమ్మ నా కివ్వండి.''

''క్షమించండి. అది నా తృప్తి కోసం వేసుకొన్న బొమ్మ. దాని విలువ పదివేలు కాదు.''

ఆమె మరింత పట్టుదలతో "కోటి ఇచ్చినా ఇవ్వరా?" అంది. అతడు మాట్లాడలేదు. ''చివరి మాటగా చెపుతున్నాను. మొత్తం బొమ్మలు అన్నీ ఇవ్వండి. పది లక్షలు ఇస్తాను'' అంది.

అతడు విస్తుబోయినట్టు చూశాడు. ఆమె గెలిచినట్టు నవ్వి ''ఆశ్చర్యపోకండి. నాకు పట్టుదల వస్తే అంతే. డబ్బొక సమస్య కాదు. పది లక్షల్తో వెళ్ళి శాంతినికేతన్‌లో చేరండి. మీ ఆర్టు ఇంకా పెంపొందించుకోండి. మీ బొమ్మల్ని నా ఇంట్లో అందంగా అమర్చి వాటికి మరింత అందం తెస్తాను. మీకు కావలసి వచ్చినపుడు వచ్చి వాటిని చూసుకోవచ్చు'' అని ఆగి ''ఏమిటలా చూస్తున్నారు? ఏ ఇండియన్ పెయింటర్ కీ రానంత సొమ్ము రావటం ఆశ్చర్యంగా ఉందా?'' అని అడిగింది.

''అవును. ఆశ్చర్యంగానే ఉంది. కోటికి అమ్మని వాడిని పదిలక్షలకి ఎలా అమ్ముతాననుకున్నారు? ఇంతకాలం నుంచీ బిజినెస్ చేస్తున్నా మీకు ఎవరితో ఎలా వ్యాపారం చెయ్యాలో తెలియకపోవటం ఆశ్చర్యంగానే ఉంది.''

ఆమె మొహం జేవురించింది. ''పోనీ మీతో ఎలా వ్యాపారం చెయ్యాలో చెప్పండి'' అన్నది కరుగ్గా.

''మీకా బొమ్మ ఊరికే ఇస్తాను తీసుకోండి.''

''అవసరం లేదు. మిమ్మల్ని ఎలాగయినా వొప్పిస్తాను.''

''మీరు నా ఉద్యోగం తీసేసినా, మీ పలుకుబడి ఉపయోగించి మరెక్కడా ఉద్యోగం రాకుండా చేసినా సరే, ఇవ్వను'' స్థిరంగా అన్నాడు.

''నిజంగానే కోటిరూపాయలిస్తాను.''

''అయినా ఇవ్వను.''

''పది కాగితాల మీద నాలుగు బ్రష్‌లతో ఏడు రంగులు కలిపి వేసిన గీతలకి కోటి రూపాయలిస్తానంటే అమ్మరా?''

''మీ మీద మీకు గొప్ప విశ్వాసంలా ఉందే.''

ఆమె ఊపిరి ఆమెకే వెచ్చగా తగిలింది. అంత ఘోరమైన అవమానాన్ని సహించడం ఆమెకి అదే మొదటిసారి. గుండెల్లోకి ఊపిరి గట్టిగా పీల్చుకొని అంది ''నా ఆస్తంతా ఇస్తాను. ఇవ్వరా?'' అంది.

''ఆస్తంతా నాకిచ్చేస్తే మీరేం చేస్తారు?''

''అడుక్కుతింటాను. లేదా ఎవరి ఇంట్లోనైనా వంట చేస్తాను. ఏం చేస్తే మీ కెందుకు? చెప్పండి. ఇస్తారా?''

''ఇస్తాను''

ఆ మూడు అక్షరాలూ త్రిశూలంలా బయల్దేరి ఆమె కర్ణపుటాలు చేరి, అతడు చెపుతున్నది అర్థమయ్యేసరికి బకెట్ నిండా తెల్లటి సున్నం తీసుకుని బలంగా మొహంమీద కొట్టినట్లుగా తెల్లగా పాలిపోయింది కళ్యాణి వదనం.

అతడామె దగ్గరగా వచ్చాడు. ''ఒక పాము జీవిత సత్యాల్ని తెలుసుకుని వేదాంతి అయిందట. ఒక ముని సలహా మీద కాటు వేయడం మానేసిందట. దాన్ని వీలుగా తీసుకుని జనం రాళ్ళతో కొట్టడం మొదలుపెట్టారుట. తరువాతెప్పుడో ఆ దారి వెంట వచ్చిన ముని, హీనావస్థలో ఉన్న ఆ పాముని చూసి ఆశ్చర్యపడి ''నేను కాటు వేయొద్దన్నాను కాని బుస కొట్టవద్దనలేదే'' అన్నాట్ట. ఆ సత్యాన్ని నేను కూడా ఇప్పుడే గ్రహించాను...'' అతను ఆగాడు. ఆమె ఇంకా తేరుకోలేదు. అతడు కొనసాగించాడు.

''నువ్వంటే నాకు సానుభూతి ఉండేది. 'ఒక లక్షాధికారి అయిన అమ్మాయి చిన్నతనంలోనే బంధువుల చేత, స్నేహితుల చేత మోసగింపబడి మనుష్యుల మీదే నమ్మకం పోగొట్టుకుని మానసికంగా వంటరిదై పోయిందే' అని జాలిగా ఉండేది. ఒక రాత్రి నువ్వు నాకు ఫోన్ చేసి 'నేనేమైనా మానసిక వ్యాధితో బాధపడుతున్నానా' అని అడిగావు గుర్తుందా? నిజంగానే నీకు ట్రీట్‌మెంట్ అవసరం చాలా ఉంది. అవతలివాళ్ళని అర్థం చేసుకోవటం ఎలాగో నీకు నేర్పాలి. నీ తెలివితేటలమీద నీకు అపారమైన విశ్వాసం ఉంది. అవతలివాళ్ళని నీ చేతి వేళ్ళమీద ఆడించగలనని కూడా నమ్మకం ఎక్కువ. ముందు ముందు చాలా ప్రమాదం ఇది. మానసిక రోగం పోవాలి అంటే కొంతకాలం నువ్వు ముష్టెత్తుకు బ్రతకాలి. లేదా ఎవరింట్లోనైనా వంట చేస్తూ ఉండాలి'' అతను నవ్వలేదు. సీరియస్‌గానే అన్నాడు. ''... నా బొమ్మల ఖరీదు కోటికన్నా ఎక్కువే! ఆ మాటకొస్తే నీ ఆస్తికన్నా ఎక్కువే. కానీ ఒక అమ్మాయిని మానసికంగా బాగు చేసేందుకు అవి

ఉపయోగపడుతున్నాయంటే  అంతకన్నా గొప్ప విలువ వాటికి ఇంకేమీ ఉంటుంది? ఆ ఉద్దేశ్యంతో వాటిని నీకు అమ్మేస్తున్నాను.''

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments